విశాలాంధ్ర కృష్ణా జిల్లా

ఉత్తమైనది వైద్య వృత్తి : ఎంపీ బాలశౌరి



విశాలాంధ్ర-గన్నవరం : సమాజంలో ఉన్న వృత్తులలోకెల్లా వైద్య వృత్తి చాల ప్రాముఖ్యమైనదని, ఉత్తమమైనదని మనకు జన్మను ప్రసాదించేది తల్లి అయితే, ఏదైనా జరిగితే పునర్జన్మను ఇచ్చేది మాత్రం వైద్యులే అని ఎంపీ వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. చిన అవుటుపల్లి వద్ద ఉన్న పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజ్‌లో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులకు వైట్‌కోట్ డిస్ట్రిబ్యూషన్ (ఫ్రెషర్స్ డే) వేడుకలలో పాల్గొన్న ఎంపీ మాట్లాడుతూ కష్టపడి నిజాయితీగా చదివి తమ తల్లిదండ్రులకు, పిన్నమనేని మెడికల్ కాలేజ్‌కు మంచి పేరు తీసుకురావాలని కోరారు. రోగులలో ఆత్మస్థైర్యాన్ని నింపి వారికీ జీవం పోసేవారు వైద్యులు గనుక ఈ వృత్తిలోనికి ప్రవేశించిన మీరు చాలా అదృష్టవంతులు అని పేర్కొన్నారు. అనంతరం మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులకు వైట్ కోట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ చదలవాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మట్టి ఖర్చులకు రూ.10వేలు

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడి పిఎసిఎస్ డైరెక్టర్‌గా పనిచేస్తూ మూడు రోజుల క్రితం చని పోయిన భట్ల పెనుమర్రు మాజీ సర్పంచ్ దొప్పల పూడి పాప మట్టి ఖర్చులు నిమిత్తం రూ.10 వేలు మంగళవారం ఆమె కుటుంబ సభ్యులకు సొసైటీ అధ్యక్షురాలు కైలా శ్రీవల్లి, ఎంపీపీ కొండేటి ఇందిర అందజేశారు. తొలుత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైసీపీ నాయకులు కైలా రమేష్ బాబు, కొండేటి చందు, సొసైటీ సీఈవో కట్టా వెంకటరమణ, దోనే రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో కొమ్మారెడ్డికి ప్రథమస్థానం

విశాలాంధ్ర-బంటుమిల్లి : బందరు డివిజన్ స్థాయిలో రవాణాశాఖ రోడ్డు భద్రత అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో స్థానిక కొమ్మారెడ్డి టాలెంట్ హైస్కులు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని, పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రవాణాశాఖ ఈ నెల 18 నుండి 24 వరకు రవాణాశాఖ వారోత్సవాల నిర్వహించారన్నారు. కొమ్మారెడ్డి విద్యార్థులైన వెంట్రపాటి కీర్తన 10వ తరగతి ప్రథమస్థానం, పామర్తి నిత్యానంద లోకేష్ 8వ తరగతి ద్వితీయస్థానాన్ని సాధించారన్నారు. విజేతలకు కృష్ణాజిల్లా ఎస్పీ జాషువా మంగళవారం బహుమతులు అందజేశారని కొమ్మారెడ్డి కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ, డీటీఓ సీతాపతి తదితరులు ఉన్నారన్నారు, కీర్తన, నిత్యానంద లోకేష్‌ను తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు, డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్‌లు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో మెరిసిన వక్కలగడ్డ యువకుడు

విశాలాంధ్ర-చల్లపల్లి : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం వక్కలగడ్డ గ్రామానికి చెందిన మురాల రాజశేఖర మణికంఠ తన సత్తా చాటాడు. ఈనెల 20, 21 తేదీలలో శ్రీకాకుళంలో జరిగిన 66వ రాష్ట్రస్థాయిల స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ లో అండర్ 17 బాలుర విభాగంలో 400 మీటర్ల పరుగులో రజకపతకం, 300 మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించాడు. మారుమూలకులో పుట్టిన రాజశేఖర్ మణి కంఠ రాష్ట్రస్థాయిలో తన సత్తా చాటడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర మణికంఠ ను, అతనికి కోచింగ్ ఇచ్చిన కోచ్ జషీమ్‌ను గ్రామ ప్రముఖులు వక్కలగడ్డ పాలకేంద్రం అధ్యక్షులు మల్లుపెద్ది నాగభూషణరావు, వక్కలగడ్డ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ తదితరులు అభినందించారు.

మృతి చెందిన సంఘ కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కోడూరు : మండల పరిధిలోని ఉల్లిపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రుణం పొందన ఖాతా దారులు హరిపురం గ్రామానికి చెందిన పూషడపు వెంకట రమేష్, హంసలదీవి గ్రామానికి చెందిన కొప్పునాతి యలమందులు ఇటీవల కాలంలో మృతి చెందగా మృతులకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నిబంధనలు ప్రకారం ఒక్కొక్కకుటుంబానికి 10వేలు చొప్పున 20 వేలు సంఘ ప్రెశిడెంట్ కటకటం వెంకట కుటుంబరావు మంగళవారం అందచేసారు.

పాఠశాలలో 100 శాతం హాజరు తప్పని సరి : ఎంపీడీఓ

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ రూరల్ మండలంలోని లింగవరంలోని ప్రభుత్వ పాఠశాలను ఎంపిపి గద్దె పుష్పరాణి, ఎంపీడీవో వెంకటరమణలు ఆకస్మిక మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను పరిశీలించి విద్యార్థుల హాజరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో 100 శాతం హాజరు ఉండే విధంగా, విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతి గదులకు హాజరుఅయ్యే విధంగా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం కోటిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భారత మాజీ ప్రధాని పీ.వీ విగ్రహ దాత రెడ్డయ్య

విశాలాంధ్ర-కూచిపూడి : మచిలీపట్నంలో భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కాంశ్యవిగ్రహ ఏర్పాటులో బందరు మాజీ ఎంపీ కేపీ రెడ్డయ్య ప్రధానపాత్ర వహించి అప్పట్లో రూ.5 లక్షలు విరాళంగా ఇచ్చిన స్ఫూర్తిదాతని జిల్లా బ్రాహ్మణ సంఘ నేతల పలువురు కొనియాడారు. కేపీ రెడ్డయ్య స్వగ్రామమైన కారకంపాడు గ్రామానికి మంగళవారం విచ్చేసిన వారు ఆయనకు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు, పెనమలూరు శాసనసభ్యులు కేపీ సారథికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన నేతలు వేమూరి రాధాకృష్ణ, మోపర్తి సుబ్రహ్మణ్యం,పి.వి.ఫణి కుమార్,, డాక్టర్ ఏ ఆర్ కే మూర్తి, అంబడిపూడి నాగలక్ష్మి, పాల్గొని ఆయన గల అనుబంధాన్ని మననం చేసుకున్నారు. అదేవిధంగా కే డి సి సి బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు కూడా నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఆడపిల్లల్ని రక్షిద్దాం

విశాలాంధ్ర-పమిడిముక్కల: తల్లిదండ్రులు ఆడపిల్లల్ని సంరక్షించాలని అసమానతలు తొలగించాలని ఉయ్యూరు ఐసిడిఎస్ సిడిపిఓ యన్. ఆరుద్ర అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాడంకిలో బాలికల దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న అసమానతలు సమస్యలు అవగాహన కల్పించేందుకు భారత ప్రభుత్వం శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ జనవరి 24వ తేదీన జాతీయ బాలికల దినోత్సవం పాటిస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.స్వరూపరాణి అంగన్వాడి సూపర్వైజర్ ఉష సుజాత కళ్యాణి సత్య అంగన్వాడీ టీచర్స్ వర్కర్స్ ఆశా వర్కర్లు ఎ యన్ యం లు తదితరులు పాల్గొన్నారు.

పెదపారుపూడిలో...

మండలంలో వెంట్రప్రగడ, పెదపారుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల దినోత్సవం నిర్వహించినట్లు మండల ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం. శివ నాగమణి మంగళవారం తెలిపారు. సూపర్వైజర్ మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్ష లేకుండా అందరిని సమానంగా చూడాల్సిన బాధ్యత, అవసరం ఎంతైనా ఉందని సూపర్వైజర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పెదపారు పూడి హెచ్ఎం భవాని, హెల్త్ సూపర్వైజర్ చంద్రశేఖర్, అంగనవాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

'విశాఖ' ప్రైవేటీకరణను అడ్డుకుందాం

విశాలాంధ్ర-మచిలీపట్నం : సీపీఐ, ఎమ్మెల్యేలు, ఎంపీల పదవి త్యాగఫలమే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పడడానికి దోహదం చేసిందని, కానీ నేటి పాలకులు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటు పరం చేసేందుకు సిద్ధపడుతున్నారని, అడ్డుకుందామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ, ఏఐటీయూసీ రాష్ట్ర సమితుల పిలుపులో భాగంగా మంగళవారం స్థానిక ధర్నాచౌక్ లో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, ఏఐటీయూసీ నగర కార్యదర్శి లింగం ఫిలిప్ అధ్యక్షత వహించారు. సీపీఐ జిల్లా నాయకులు వెలగపూడి ఆజాద్ దీక్ష శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ బీజేపీ నియంత్రత పోకడకు కార్పొరేట్ కంపెనీ ఆదాని, అంబానీలను ప్రపంచంలోనే అత్యంత ధనిక స్థాయికి తీసుకెళ్లారని, అత్యాశతో వారికి కేంద్రంలోని మోడీ ప్రజల సొమ్ము దోచిపెడుతుందని ఆయన దుయ్యబట్టారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లా డుతూ ప్రాణత్యాగాలతోటి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ఆంధ్రులం సాధించుకుంటే, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఆదానీలకు దోచిపెడుతుందని ఆయన తీవ్రంగా విమర్శించారు. భారతదేశంలోనే అనేక ఫ్యాక్టరీలను, రైల్వేశాఖను నిర్వీర్యం చేసి ఆదానీ, అంబానీలకు దోచిపెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ కాకుండా అందరం కలిసికట్టుగా పోరాడేయాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా ఇంచార్జ్ కార్యదర్శి తాడిపర్తి తాతయ్య మాట్లాడుతూ మోడీ సర్కార్ ధీరుభాయ్ అంబానీ ఆదానీలకు ప్రజల సొమ్ము దారాదత్తం చేయడానికి వ్యవహరిస్తున్న తీరు సిగ్గుమాలిన చర్యగా ఉందని, విశాఖ ఉక్కుని కాపాడుకోవాలని అది మన ఆంధ్రుల హక్కుగా భావించి ఉద్యమించైనా సరే ప్రైవేటీ కరించకుండా ఫ్యాక్టరీని కాపాడుకోవాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ ఉపాధ్యక్షులు ఒంటిపులి లక్ష్మణరావు (ఓఎల్‌రావు), రైతు సంఘం నాయకులు దగాని సంగీతరావు, దగాని బుజ్జి, తూము చిన్న కొండయ్య, చెరకు శ్రీనివాసరావు, కే గగన్, బండి అరుణ ప్రసాద్, కట్టా హేమసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకుతో అన్ని అనర్థాలే...

విశాలాంధ్ర-మచిలీపట్నం : జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర కమిషనర్, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వారి ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి.గీతాబాయి డి.యం,హెచ్ ఓ కార్యాలయంలో రాష్ట్ర పొగాకు నియంత్రణ విభాగం న్యాయ సలహాదారు పుట్టి. శివ శంకర్ మాట్లాడుతూ జాతీయ పొగాకు నియంత్రణ క్యాప్టో చట్టం 2003 అమలు, పర్యవేక్షణ పై వివిధ శాఖల నుంచి వచ్చిన అధికారులకు అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. అలాగే జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వారి సహకారంతో, బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, ప్రార్థన మందిరాల ఆవరణలో, ధూమపానం చేయడం పొగాకు ఉత్పత్తుల అమ్మకం వంటి వాటికి జరిమానా విధించారన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి.గీతాబాయి మాట్లాడుతూ పొగాకు, సంబంధిత ఉత్పత్తులను సేవించడం వలన కలిగే దుష్ప్రభావాలను వివరిస్తూ ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సి.ఐ ఉమా మహేశ్వరరావు విద్యా శాఖ,ఐసీడీస్, మునిసిపల్ కార్పొరేషన్ తదితర శాఖలు జిల్లా వైద్య శాఖ ఎన్సిడి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రత్నగిరి, డాక్టర్ సౌజన్య పొగాకు నియంత్రణ జిల్లా కోఆర్డినేటర్ వేల్పూరి సుందర తారక రామారావు, బట్టు.శ్యామల,కౌన్సిలర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో అలుపెరుగని పోరాటం

భానుమతి సంస్మరణ సభలో వక్తలు

విశాలాంధ్ర-విజయవాడ : పాలక ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై అమరుల స్ఫూర్తితో పోరాటాలు సాగించాలని సీపీఐ కృష్ణాజిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఇటీవల మరణించిన కమ్యూనిస్టు నేత తాతినేని భానుమతి సంస్మరణ సభ పోరంకి స్థానిక సీతాపురం కాలనీలోని సామాజిక భవనంలో మంగళవారం జరిగింది. సభలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు హాజరయ్యారు. సభలో నార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో సీపీఐ నాయకునిగా అంచలంచెలుగా ఎదిగిన వారిలో తాతినేని వారి కుటుంబం ఉందని మాజీ ఎమ్మెల్యే మైనేని లక్ష్మణస్వామి సమితి అధ్యక్షులు మండవ వెంకట నారాయణ వంటి వారి నాయకత్వంలో ప్రజలకు అండగా ఉన్నారని గుర్తు చేశారు. భానుమతి, సీతారావమ్మలు గ్రామాల్లో మహిళాభివృద్ధికి స్వావలంబనకు కృషి చేశారని అన్నారు. కేంద్రంలో పాలక బీజేపీ ప్రభుత్వం తన ఆర్ఎస్ఎస్ అజెండాను అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్ని కార్పొరేట్ పరం చేస్తున్నారని, పెట్రోల్ డీజిల్ ధరల పెరుగుదలతో అన్ని రంగాలలో దాని ప్రభావం దేశం మొత్తం మీద పడుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలగపూడి ఆజాద్ మాట్లాడుతూ రైతు వ్యతిరేక చట్టాలు, వ్యవసాయ పంప్ సెట్‌లకు స్మార్ట్ మీటర్లు పెడుతూ ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ సీనియర్ నాయకులు మోతుకూరి వెంకటేశ్వరరావు, మాట్లాడుతూ ప్రపంచ దేశాల ఆధిపత్యం కోసం అమెరికా కుట్రలు సాగిస్తూ ఉందని ఆర్థిక సంక్షోభం వెంటాడుతూ ఉందని, సమాజంలో మానవ విలువలు నైతిక విలువలు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్నంగి నరసింహారావు అధ్యక్షత వహించగా మాజీ ఎమ్మెల్యే బోడే ప్రసాద్, టీడీపీ నియోజకవర్గ అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్, మాజీ జెడ్పీ చైర్మన్, వైసీపీ నాయకులు తాతినేని పద్మావతి మాట్లాడుతూ కమ్యూనిస్టు తాతినేని కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. సభలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు టి తాతయ్య, అడ్డాడ ప్రసాద్, నాయకులు ఎమ్. విజయ్‌కుమార్, రణధివే, అరుణకుమార్, తాతినేని రమేష్ తదితరులు పాల్గొన్నారు. తొలుత భానుమతి చిత్రపటానికి పూలదండలతో నివాళులు అర్పించారు.

జగనన్న లేఅవుట్ల్ మేరక పనులకు సహకరించాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : దక్షిణ చిరు వోల్లంకలో జగనన్న లేఅవుట్‌లకు మేరక పనులు చేసుకునేందుకు సహకరించాలని రెవెన్యూ, పోలీస్ వారికి గ్రామస్థులు, సర్పంచ్ సనకా సుబ్రహ్మణ్యంలు అర్జీ సమర్పించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో దక్షిణ చిరువోల్లంకలో ఇళ్ళ ప్లాట్‌ల నిమిత్తం రెండు జగనన్న కాలనీలను ఏర్పాటు చేశాలరని, నిరుపేదలు గృహ నిర్మాణాలు నిర్మించుకునేందుకు చాలా పల్లంగా ఉండుటంతో మేరక చేసుకునేందుకు గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని, ఇబ్బందులను చూడలేని సర్పంచ్ సుబ్రహ్మణ్యం సొంత పొలములోని మట్టిని తరలించేందుకు ముందుకు వచ్చారని, వర్షాలు రాకముందే మేరకపనులు పూర్తిచేసుకునేలా సహకరించాలని తహశీల్దార్ శివరామకృష్ణకు సీఐ శ్రీనివాసులకు సర్పంచ్‌తో కలిసి గ్రామస్థులు అర్జీలు సమర్పించారు. గత వర్షాకాలంలో పడిన వర్షాలకు ప్లాట్ లు పూర్తిగా నీటమునిగి పోయాయని, 750 ఎకరాల ఆయకట్టు గల పంట పొలాలకు వెళ్ళేందుకు కూడా మట్టి రోడ్లకు మట్టి తోలుకునేందుకు పర్మిషన్ ఇప్పించాలని అర్జీలో కోరారు.

27 నుంచి భీష్మ ఏకాదశి మహోత్సవాలు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : త్రిపుర కల్చరల్ ఆర్ట్స్, అన్నమయ్య పరివారం (హైదరాబాద్) తదితర సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో కళాకారులు సమన్వయంగా వారి వారి తల్లిదండ్రులకు ఉత్తమ లోకాల ప్రాప్తి కలగాలని నాద సంగమం పేరిట ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు సత్యనారాయణపురం శివాజీ కేఫ్ సమీపానగల శ్రీ సీతారామ కళ్యాణమంటపంలో కళా ప్రదర్శనలు నిర్వహించుకుంటున్నట్లు ఉత్సవ పర్యవేక్షకులు వయోలిన్ విద్వాంసులు డాక్టర్ పాణ్యం దక్షిణామూర్తి తెలిపారు. మంగళవారం ఉదయం ఉత్సవముల వేదిక ప్రాంగణంలో ఆయన ఉత్సవములకు సంబంధించిన కరపత్రమును విడుదల చేసి మాట్లాడారు. శ్రీ సీతారామ కళ్యాణ మండపంలో ఐదు రోజులపాటు ఉదయం 9 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు హరికథా గానం,గాత్ర సంగీతం,వయోలిన్ వాదనం, వీణావాదనం,వేణు గానం,తబల,కీబోర్డ్,నృత్యం, మృదంగం కళా ప్రదర్శనలుంటాయని తెలిపారు. 27వ తేదీ శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. మరుసటి రెండు రోజులు ఆగిరిపల్లి శ్రీ శోభనాద్రి లక్ష్మీనృసింహ వేద శాస్త్ర పాఠశాల ప్రాంగణంలో జరుగుతాయని తెలిపారు. నేతి లక్ష్మీనారాయణ భాగవతుల వారి కుటుంబ సభ్యులు నేతి భాగవతుల పేరిట హరికథా గాన కళాకారులకు నూతన వస్త్రములు సమర్పిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థుల సంక్షేమమే ఆరోగ్య మిషన్ ఉద్దేశం

విశాలాంధ్ర-మచిలీపట్నం : దేశవ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ అనే పథకం కింద పాఠశాలలో, కళాశాలలో ఉన్న విద్యార్థులకు పూర్తి ఆరోగ్యం కల్పించడమే ముఖ్య ఉద్దేశం అని కృష్ణ జిల్లా రాష్ట్ర బాలల సంక్షేమం కార్యక్రమం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రత్నగిరి అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకం ప్రకారం జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో తమ టీం పని చేస్తుందని ఆయన తెలియజేశారు. మచిలీపట్నం లేడీ యంప్తుల్ ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో రాష్ట్రీయ బాలల ఆరోగ్య కమిటీ, ఎన్.ఎస్.ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రత్నగిరి ప్రసంగించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సోనియా, జిల్లా సైకాలజిస్ట్ కే. రత్నకుమారి లేడీ యాంప్త్ ల్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ విజయ శ్రీ ఎన్.ఎస్.ఎస్. యూనిట్ అధికారి లంకిశెట్టి హరనాథ్ బాబు, అధ్యాపకులు కిరణ్మయి, సాజిదా, సుందరి, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు సంఘీభావ పాదయాత్ర

విశాలాంధ్ర-అవనిగడ్డ : సంఘీభావ పాదయాత్రను విజయవంతం చేయాలని యాసం చిట్టిబాబు పిలుపునిచ్చారు. యువగళం పేరుతో యువ నాయకుడు నారా లోకేష్ చేస్తున్న పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతూ అవనిగడ్డ లోని గ్రామ దేవత లంకమ్మ అమ్మవారి ఆలయం నుండి మోపిదేవి సుబ్రహ్మణేశ్వరస్వామి వారి దేవస్థానం వరకు మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ సౌజన్యంతో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 గంటలకు పాదయాత్ర ప్రారంభం అవుతుందని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాదయాత్రలో మండలి బుద్ధ ప్రసాద్, యువనాయకులు మండలి వెంకటరామ్(రాజా) పాల్గోంటున్నారని, కావున తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని యాసం కోరారు.

ప్లాస్టిక్, ఫ్లెక్సీ బ్యానర్లపై నిషేధం : కమిషనర్

విశాలాంధ్ర-గుడివాడ : పురపాలక సంఘ పరిధిలోని ప్లాస్టిక్, ఫ్లెక్సీ బ్యానర్ల షాపుల యజమానులతో మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ సమావేశం నిర్వహించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్, ఫ్లెక్సీ బ్యానర్లపై నిషేధం ఈనెల 26 నుండి అమల్లోకి రానుందన్నారు. వీటిపై ప్రత్యేక బృందాలతో పట్టణంలో తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, టౌన్ ప్లానింగ్ అధికారి నాగేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్యశ్రీ'తో పూర్తి స్థాయిలో సేవలు : మంత్రి జోగి

విశాలాంధ్ర- గూడూరు : డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో సేవలందేలా కృషి చేయాలని ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అధికారులకు సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కృష్ణాజిల్లా పెడన నియోజకవర్గంలో ఎంతో ఉత్సాహంగా సాగుతోంది. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ గూడూరు మండల పరిధిలో 7 క్లస్టర్లు 450 ఇల్లు 1200 మంది జనాభా గల ఐదుగుళ్లపల్లిలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విస్తృతంగా పర్యటించారు. తొలుత ఆయన ఐదుగుళ్లపల్లి గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐదుగుళ్లపల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లుక్కా ఏలేసు,గూడూరు ఎంపీపీ సంగా మధుసూదన రావు, జడ్పిటిసి వేముల సురేష్ రంగబాబు, వైస్ ఎంపీపీలు పిచ్చుక గంగాధర్ రావు, నేతల కుటుంబరావు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, గూడూరు రైతు భరోసా కేంద్రం చైర్మన్ పర్ణం మహాలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రంగు మారిన ధాన్యానికి పెరిగిన ధర

సివిల్ సప్లయిస్ డీఎం శ్రీధర్

విశాలాంధ్ర-కూచిపూడి : వర్షానికి తడిసి రంగు మారిన ధాన్యం, చెడిపోయిన ధాన్యం బహిరంగ మార్కెట్లో కొనుగోలుకు, రైతులకు న్యాయం చేసే విధంగా గతంలో కంటే ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి ధర పెంచినట్లు జిల్లా సివిల్ సప్లయిస్ డీఎం శ్రీధర్ తెలిపారు. ఆయన తహసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాదుతో కలిసి మంగళవారం వేములమడ, కాజ ఆర్.బి.కేంద్రాలను, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ప్రభుత్వం గతంలో మాదిరిగానే 10 శాతం రంగు మారిన ధాన్యానికి సాంకేతిక నిపుణులు నిర్దేశించిన ధాన్యం నాణ్యత ప్రమాణాలు ప్రకారం క్వింటాలు రూ.1930 కాగా, 75 కిలోలు రూ.1450గానే నిర్ణయించారు. అయితే మిగిలిన శాతం ధాన్యాలకు గతం కంటే ధర పెంచుతూ తీసుకున్న నిర్ణయంను వివరించారు, 10 నుంచి 20 శాతం రంగు మారిన ధాన్యానికి రూ.1850(క్వి), రూ.1390(75 కి), 20 నుంచి 30 శాతం రంగు మారిన ధాన్యానికి రూ.1630(క్వి), రూ.1220(75 కి), 30 నుంచి 40 శాతంలోపు రంగు మారిన ధాన్యానికి రూ.1500(క్వి) రూ.1125(75 కి), 40 శాతం పైన రంగు మారిన ధాన్యానికి రూ.1400(క్వి), రూ.1050 (75 కి)గా అందజేస్తామని రైతులు సహకరించాలని సూచించారు.

దేశానికి అయ్యదేవర వంటి దేశభక్తులు అవసరం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : కులమతాలకు అతీతంగా పేద ప్రజలకు తన ఇంట్లో భోజనం పెట్టి ఆదరించిన,మహాత్మా గాంధీతో కలిసి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న అయ్యదేవర కాళేశ్వరరావు వంటి దేశభక్తులు దేశానికి అవసరమని కాళేశ్వరరావు బంధువు, అయ్యదేవర కాళేశ్వరరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుర్లపాటి మహాబలేశ్వరరావు, సభ్యుడు కొప్పరపు వెంకట బలరామకృష్ణమూర్తిలు అన్నారు. పద్మభూషణ్ అయ్యదేవర కాళేశ్వరరావు 142వ జయంతి సందర్భంగా మంగళవారం కౌతా పూర్ణానందం సత్రం రెండవ గదిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. వారు మాట్లాడుతూ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, విజయవాడ మున్సిపల్ చైర్మన్‌గా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొట్టమొదటి స్పీకర్‌గా పేదల సంక్షేమానికి పాటుబడిన ఆయన వంటి నాయకులు ప్రస్తుత సమాజానికి ఎంతో ముఖ్యమని అన్నారు. స్వాతంత్రోద్యమంలో కారాగారాన ఉండి ప్రపంచ దేశాలు చరిత్రలు వ్రాశారని,అటువంటి వారి చరిత్రలు నేటి యువత తెలుసుకోవలసిన అవసరం ఎంతో ఉందని అన్నారు. సంస్మరణ కార్యక్రమంలో మాదుగుల రామకృష్ణ,చింతకాయల చిట్టిబాబు, చలపతిరావు,డాక్టర్ కె ఆర్ జి శేషు కుమార్, ఆంజనేయరాజు తదితరులు పాల్గొని అయ్యదేవర వారికి నివాళులర్పించారు.

మట్టి టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం చినముత్తేవిలో ఆగస్టులో నిర్మించిన బెయిలీబ్రిడ్జిపై భారీ వాహనాలను నిషేధిస్తూ ఆ వంతెనకు రెండువైపులా పరిమితమైన ఎత్తులో ఏర్పాటుచేసిన గడ్డర్లు తొలగించి మట్టిటిప్పర్లు తిప్పడానికి చేసిన ప్రయత్నాన్ని మంగళారం గ్రామస్తులు అడ్డుకున్నారు. తెల్లవారుజాములోగా యుద్ధప్రాతిపదికన గడ్డర్లు తొలగించారు. ఆ తొలగింపు ఆర్టీసీ బస్సులు తిరగటం కోసమే నని భావించిన గ్రామస్తులకు అది అడియాశగానే మారింది. తెల్లారే సరికి గూడూరు నుంచి మట్టి టిప్పర్లు కూచిపూడి నుంచి మొవ్వ వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డు సమీపంలో పొలం మెరకచేయడానికి వెళ్లడానికి ప్రయత్నించటంతో గ్రామస్తులు ఆగ్రహించి అడ్డుకోవటంతో ఆ వాహనాలు వెనక్కి వెళ్ళక తప్పలేదు. అయితే దీనిపై కూచిపూడి పోలీసులకు సమాచారం వెళ్లడంతో స్పందించిన ఎస్ఐ డి.సందీప్ ఆ వాహనాల రూటు మార్చి వెళ్లాలని చేసిన సూచనతో అవి గూడూరు-నిడుమోలు-పామర్రు మీదుగా మెరగ చేసే స్థలానికి చేరుకున్నాయి. గత ఏడాది జూన్ నెలాఖరులో ఆ వంతెన శిథిలావస్థకు చేరి పడిపోవడంతో లక్షలాది రూపాయలు వెచ్చించిబెయిలీ బ్రిడ్జిని నిర్మించారు. అవంతెనమీద నుంచి భారీ వాహనాలుఆర్టీసీ బస్సులను సైతం రాకుండా అడ్డంగా వేసిన గడ్డర్లు తొలగించడంతో బందరు డిపో బస్సు వస్తుందేమోనని ఆశపడ్డామని, భారీగా మట్టివాహనాలు వస్తుండడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తప్ప లేదని మాజీ ఎంపీటీసీ సభ్యులు పోతుల చంద్రహాస్ తెలిపారు. మధ్యాహ్నం నుంచి తిరిగి మళ్ళీ యధా స్థితిగా పరిమితమైన ఎత్తుతోగడ్డర్లు ఏర్పాటు చేస్తున్నారు.

జగన్ ప్రభుత్వం చేపుతున్నవి అన్ని పచ్చి అబద్దాలే...

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఎస్సీ,ఎస్టీలకు తాను ఎన్నో చేశానని పచ్చి అబద్దాలు చెప్పడమే కాకుండా తన తర్వాతే బి.ఆర్.అంబెడ్కర్ అనే విధంగా జాతిని వంచిస్తున్నారని జై భీమ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడ శ్రావణ్ కుమార్ ఆరోపించారు. గాంధీనగర్‌లోని వారి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం యస్ సి, ఎస్ టి లకు ఎన్నో చేశాని పచ్చి అబద్దాలు చేపుతున్నారని ఇప్పటికైన జాతి మేల్కొలపాలి అనే ఉద్దేశ్యంతోను తాను ముందుకు వచ్చానన్నారు.ప్రభుత్వం దళితులకు అధికారికంగా ఏ నిధులు ద్వారా ఎంత ఖర్చు చేశారో అని ప్రభుత్వ అధికారులు దగ్గర నుండి 650 డ్యాక్యుమెంట్స్ పొందడం జరిగిందన్నారు.వైసీపీ ప్రభుత్వం మాదిరి గతంలో ఉన్న ఏ ప్రభుత్వంలో కూడా యస్ సి, యస్ టి లు ఇంతగా దగా పడలేదన్నారు. ప్రతీ సంవత్సరం సబ్ ప్లాన్ నిధులు కేటాయించి సుమారు 35 శాతం అన్ ముటిలైజ్ ఫండ్స్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.వాటిని ఇతర పథకాలకు మళ్లిస్తున్నారన్నారు. ఎన్టీఆర్ యూనివర్సిటీ పేరు మారిస్తే వైసీపీలో ఉన్న కమ్మ వారు కూడా మాట్లాడలేదన్నారు.ఒక్క విద్యార్థి అయినా స్కాలర్ షిప్ ఇచ్చారా అన్నారు. కేసులు తప్పించుకోవటానికి మోడీ, షా కాళ్ళు మొక్కుతారు అని ఎద్దేవ చేవారు.తమ పార్టీ అభ్యర్థులు మార్చి 01 నుండి గడప గడపకు దగా ప్రభుత్వం అని ప్రతీ నియోజక వర్గంలో ప్రతీ గ్రామానికి వెళతారన్నారు.అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని ముందుకు వెళతాం , ప్రజలు ఓటు హక్కుతో సమాధానం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరస సురేష్,తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

- నందిగామలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిరసిస్తూ సీపీఐ దీక్ష
- రాజకీయ పార్టీలు, నందిగామ బార్ అసోసియేషన్ సభ్యుల మద్దతు

విశాలాంధ్ర-నందిగామ : విశాఖ ఉక్కు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిరసిస్తూ కార్మిక సంఘాల గర్జనకు సంఘీభావంగా నందిగామ నియోజకవర్గం సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గాంధీ సెంటర్లో రిలే నిరాహార దీక్ష కార్యక్రమాలను సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చుండూరి సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు, విజయవాడ డిప్యూటీ సెక్రటరీ దోనేపూడి శంకర్ హాజరై నిరాహారదీక్షకు మద్దతు తెలిపారు. ఈ దీక్ష కార్యక్రమానికి సభాధ్యక్షులుగా మన్నె నారాయణరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అని లాభాల్లో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిరసిస్తూ కార్మిక సంఘాల నేతలు తలపెట్టిన గర్జనకు సంఘీభావంగా నందిగామ నియోజకవర్గ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరాహార దీక్షలో పాల్గొన్నామని అన్నారు. బీజేపీ ఎన్నికలకు ముందు ప్రజలను మభ్యపెట్టడానికి అనేక వాగ్దానాలు చేసి వ్యవస్థలను చిన్నాభిన్నం చేస్తూ ప్రాంతీయ పార్టీల మనుగడను దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్నాయని ప్రాంతీయ పార్టీలు పాలించే ప్రాంతాలపై వివక్ష చూపుతున్నాయని అన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ముందుకు సాగుతామని మున్ముందు రోజుల్లో నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరిని విడనాడి ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలు దెబ్బతీయకుండా చూడాలని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ కాకుండా కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. పార్లమెంటులో పూర్తి బలం ఉండటంతో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రతిపక్షాలు నిరోధించలేని పరిస్థితిలో ఉన్నాయని దేశ ప్రజలు రానున్న ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా నందిగామ బార్ అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నెగంటి జీవరత్నం మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో జరిగే గర్జనకు తమ పూర్తి మద్దతు అందిస్తున్నట్లు ప్రకటించారు. నిరంకుశ వైఖరికి మద్దతు పలికే ప్రతి పార్టీకి రానున్న ఎన్నికల్లో దేశ రాష్ట్రాల ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హితవుపలికారు. సీపీఎం నందిగామ నియోజకవర్గ కార్యదర్శి సైదులు నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపి సభలో ప్రసంగించారు. రాజకీయ పార్టీల నుండి ఈ దీక్షకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా చుండూరు సుబ్బారావు అభినందనలు తెలిపారు. ఈ నిరాహార దీక్షలో సీపీఐ మైలవరం నియోజకవర్గ కార్యదర్శి బుడ్డి రమేష్, జగ్గయ్యపేట పట్టణ కార్యదర్శి జే శ్రీనివాసరావు, జగ్గయ్యపేట నియోజకవర్గ సహాయ కార్యదర్శి శివాజీ, చామంతి, వేముల వీరయ్య, నందిగామ మండల కార్యదర్శి మన్నే హనుమంతరావు(అంజి), సీపీఐ విజయవాడ నగర కార్యవర్గ సభ్యులు కొట్టు రమణ, జిల్లా ఏఐవైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు లంకా గోవిందరాజులు, పెయ్యల పృథ్వీరాజ్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు వై.భాను తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు కంకణ బద్ధులవుదాం : సీహెచ్ కోటేశ్వరరావు

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : విశాఖ ఉక్కు- విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ ప్రజలు ఏకోన్ముఖంగా నినదిస్తూ అక్రమ అరెస్టులు, అక్రమ కేసులు, జైళ్లు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నిర్వహించిన వీరోచిత పోరాటాల ద్వారా గత ఆరు దశాబ్దాల క్రితం సాధించుకున్న ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయాలనే మోదీ ప్రభుత్వ దుష్ట పన్నాగాల నుండి పరిరక్షించుకునేందుకు అన్ని రంగాలలో పనిచేస్తున్న కార్మికులంతా కంకణ బద్ధులు కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. సీపీఐ, ఏఐటీయూసీ రాష్ట్ర సమితులు ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం ఏఐటీయూసీ ఇబ్రహీంపట్నం మండల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్మిక ప్రదర్శనను ఉద్దేశించి సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న నరేంద్ర మోడీ అమిత్‌షా నాయకత్వంలోని ప్రభుత్వాన్ని దించకపోతే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సర్వం నాశనం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వానికి తగినబుద్ధి చెప్పాలంటే విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సీపీఐ మైలవరం నియోజకవర్గం కార్యదర్శి బుడ్డి రమేష్, ఏఐటీయూసీ మండల నాయకులు టీ నరసింహారావు కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. జోజిబాబు, తిరుపతి రావు, వి నాగేశ్వరరావు, కృష్ణ, పి సాంబశివరావు, దుర్గమ్మ, నాగమణి, అంజమ్మ, రమణ, బాలమ్మ, పిచ్చమ్మ, తదితరులు ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

నేడు 'ఉక్కు' ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన దీక్ష

విశాలాంధ్ర-విజయవాడ : 'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' ఆంధ్రులు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో ఈ నెల 25న నిరసన దీక్ష నిర్వహించనున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు విజయవాడ లెనిన్‌సెంటర్‌లో ఈ కార్యక్రమం జరుగుందని పేర్కొన్నారు.

40వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-వీరులపాడు: మండల కేంద్రాన్ని వీరులపాడులోని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ 40వ రోజు రిలే నిరాహార దీక్షలో వీరులపాడు గ్రామస్తులు మంగళవారం పాల్గొన్నారు. 40వ రోజున రిలే నిరాహార దీక్షలో ఆకుల శ్రీనివాసరావు, వాసిరెడ్డి శ్రీనివాసరావు, గూడూరు శ్రీనివాసరెడ్డి, పాటిబండ్ల మల్లికార్జునరావు,పాటిబండ్ల సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రం తరలింపు నిర్ణయం ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు తమ నిరసనను రోజు రోజుకి ఉధృతం చేస్తామని తెలిపారు.

పురుగుమందులు అధిక ధరలకు అమ్మితే చర్యలు : ఏడి కేనడి

విశాలాంధ్ర-ఎ కొండూరు : ఏ కొండూరు మండలంలోని ఎరువులు పురుగుమందుల దుకాణాల యజమానులు ఎరువులు కానీ పురుగు మందులు కానీ అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తిరువూరు డివిజన్ వ్యవసాయ సంచాలకులు జే. కెనడి పురుగుమందుల షాపుల యజమానులను హెచ్చరించారు. మండలంలోని ఏ కొండూరు చీమలపాడు కంభంపాడు గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాల్లో మంగళవారం ఆయన ఏవో టిప్పు సుల్తాన్ ఏఈఓ రామచంద్రరావుతో కలిసి తనిఖీ చేశారు. ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు ఇన్వాయిసులు స్టాక్ రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలు పురుగు మందులు కొనే రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని లైసెన్స్ ఉండి రిజిస్టర్ చేసిన డీలర్ల దగ్గరే మందులు కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆమోదం తో లేబులు ఉన్న ఎరువులు పురుగుమందుల్ని కొనాలని సూచించారు రైతులు మందులు కొనే సమయంలో తయారు తేదీ తుది గడువు తప్పనిసరిగా గమనించాలని సూచించారు మండలంలోని ఏ షాపులోనైనా ఎమ్మార్పీ ధరల కంటే అధిక రేట్లకు విక్రయిస్తే వారిపై తమకు వెంటనే ఫిర్యాదు చేయవచ్చని ఆయన రైతులకు చెప్పారు. ఏ కొండూరు మండలం చీమలపాడు గ్రామంలో పురుగుమందుల దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

Our Daughter **MYNENI GOMATHI** (Old Name), D/o. Myneni Veerendra Sivanath and Myneni Vanaja, residents of D.No.5-194, Bhagyanagar, Kanuru, Vijayawada 520007, AP. We have changed our daughter name to **MYNENI GOMATHI LAKSHMI**(New Name). Henceforth, She will be known as **MYNENI GOMATHI LAKSHMI**

CHANGE OF NAME

I, **SHAIK ADBUL KAREEM, (old Name)** S/o.PENTU SAHEB, R/o.No.1-3-252/1, Guptha Center, Ambedkar Road, Vidyadharapuram, VIJAYAWADA - 520 012, AP., Have Change My Name to **SHAIK ABDUL KAREEM (New Name).** Here after My Name is known as **SHAIK ABDUL KAREEM**

ఆహుతులను అలరించిన నాటిక ప్రదర్శనలు

నాటకరంగ కళాకారులకు ప్రభుత్వం చేయూత అందించాలి

ముగింపు సభలో సినీ నటులు పిళ్కా లక్ష్మి ప్రసాద్

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : నాటక రంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహించాలని సినీ నటుడు పిళ్కా లక్ష్మీ ప్రసాద్ అన్నారు. సుంకర టీ కృష్ణ మెమోరియల్ ఆధ్వర్యంలో కొండపల్లి నాగార్జున కళాపరిషత్ ప్రాంగణం (రవీంద్ర భారతి పాఠశాల) లో జరుగుతున్న 15వ ఆహ్వాన నాటిక ప్రదర్శనలు ముగిశాయి. కళాపరిషత్ అధ్యక్షులు దేవినేని. కిషోర్ కుమార్

అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ గతంలో నాటక రంగాన్ని ప్రభుత్వం కొంతమేర ప్రోత్సహించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ, నాటిక అనేది చాలా ఖర్చుతో కూడుకున్న విషయమని 15 ఏళ్లుగా నాటికలను ప్రోత్సహిస్తూ, కళ ను అంతరించిపోకుండా నాగార్జున కళా పరిషత్తు అధ్యక్షుడు కిషోర్ కుమార్ అందరికీ ఆదర్శప్రాయుడని అభినందించారు. అనంతరం నాటక రంగ విమర్శకులు, విశ్లేషకులు స్నేహాలయ ఆర్ట్స్, విజయవాడ నిర్వాహకులు బొజ్జ గౌరీ శంకర్ ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సినీ దర్శకులు ఎంవి రఘు, రంగస్థల నటులు ఆచంట బాలాజీ నాయుడు. కల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మూడవరోజు ప్రదర్శించిన పక్కింటి మొగుడు నాటిక ఆహుతులను అలరించింది. బహుమతులు అందజేశారు.

టిడ్కో ఇళ్ల సంతకాల సేకరణకి అనూహ్య స్పందన

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్) : సీపీఐ రాష్ట్ర కమిటి పిలుపు భాగంగా 49వ డివిజన్ కమిటి ఆధ్వర్యంలో టిడ్కో ఇళ్ల లబ్దిదారుల సంతకాలు సేకరణ కార్యక్రమం స్థానిక రావిచెట్టు సెంటర్ గున్నాబత్తుల అచ్చయ్య వీధిలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపుడి శంకర్ మాట్లాడుతూ సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన టిడ్కో ఇళ్ల లబ్దిదారుల సంతకాల సేకరణ కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తుందన్నారు. గత ప్రభుత్వం పేదల కోసం టిడ్కో ఇళ్లు నిర్మిస్తే, ఇప్పుడు టిడ్కో నివాసాలు, కోతులకి ఆవాసాలుగా మారాయని ఏద్దేవా చేశారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం కాదని, కక్ష సాధింపుకే అధికారాన్ని దుర్వినియోగం చేస్తోందనే విషయం ప్రజలదరికి అర్థమైందన్నారు. సీపీఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రభుత్వ తీరుని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా టిడ్కో జగనన్న ఇళ్ల లబ్దిదారులు అందరికి మేలు చేయాలని లక్ష్యంతో ఫిబ్రవరి 22 వ తేదీన మహాధర్నా కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు తాడి పైడియ్య, 49వ డివిజన్ కార్యదర్శి బోరా రామకృష్ణ, 49వ డివిజన్ సహాయ కార్యదర్శి వినుకొండ శాంసన్, చేపూరి నాగేశ్వరరావు, గుజ్జారిఅప్పారావు, ఏఐ వైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు లంకా జూనియర్ గోవిందరాజులు, 54వ డివిజన కార్యదర్శి మురిగేషన్ రాము, 55వ డివిజన్ కార్యదర్శి పగటిపత్తుల రాము, ఏ ఐ వై ఎఫ్ నగర్ ఉపాధ్యక్షుడు లంకే సాయి,నడకుడిటి సూర్యనారాయణ, పెద్దాద బాబ్జీ, బోరా రాము, సయ్యద్ అకీమ్, పెటేటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదవాని సొంతింటి కల నెరవేర్చండి

విశాలాంధ్ర-విజయవాడ : ముఖ్యమంత్రి జగన్ పేదవాని సొంతింటి కల నెరవేర్చాలని సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. 45వ డివిజన్ భవానీపురం జోజినగర్‌లో పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన టిడ్కో ఇళ్ల లబ్దిదారుల సంతకాల సేకరణ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవానికి ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం నగరంలో 11వేల మంది లబ్దిదారులకు అడుగుల ప్రాతిపదికన డిపాజిట్లు కట్టించుకుందని తెలిపారు. పేదలు అధిక వడ్డీలకు అప్పులు చేసి డిపాజిట్లు కట్టారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం వచ్చి మూడున్నర ఏళ్లు గడిచినా ఇల్లు ఇవ్వకపోవటంతో అటు ఇంటి అద్దెలు చెల్లించలేక, ఇటు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఒక్క రూపాయి కూడా కట్టించుకోకుండా అందరికీ ఇల్లు ఇస్తామని చెప్పిన జగన్ నేడు మాట మార్చి, మడమ తిప్పారని విమర్శించారు. వెంటనే టిడ్కో లబ్దిదారులకు ఇల్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జగనన్న ఇళ్ల విషయంలో కొంత మందికే స్థలాలు కేటాయించారనిచెప్పారు. ఇళ్ల లబ్దిదారులందరికీ స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ప్రభుత్వం ప్రకటించిన లక్షా ఎనభైవేల రూపాయల ఆర్థిక సహాయాన్ని రూ. 5లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు పంచదార్ల దుర్గాంబ, డివిజన్ పార్టీ సహాయ కార్యదర్శి యర్రసాని జోసఫ్ , అంజూరి సూరిబాబు, కె.పిచ్చయ్య, ఏ.వి. రంగారావు,జి. రాంబాబు ఆర్.సుబ్బారెడ్డి, దేవారాజ్, పి. విశాల్,ఎ.చందు తదితరులు పాల్గొన్నారు.

ముఖ ఆధారిత హాజరులో ఇబ్బందులు తొలగించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ముఖ ఆధారిత హాజరులో ఉద్యోగులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని ముఖ ఆధారిత వ్యవస్థలోనే అనేక సాంకేతిక లోపాల వలన దయనందన కార్యక్రమాన్ని ముందుకు సాగించలేని పరిస్థితి ఏర్పడుతుందని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆ ఇబ్బందులన్నీ తొలగించాలని జేఏసీ చైర్మన్ ఏ విద్యాసాగర్ కోరారు.ముఖ ఆధారిత హాజరుపై నగరంలోని వివిధ డిపార్టెమెంట్ ఉద్యోగులుతో విజయవాడ నగర శాఖ ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన విద్యాసాగర్ మాట్లాడుతూ ముఖ ఆధారిత హాజరు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిందని దీనిని అమలు చేసే క్రమంలో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డిపార్ట్మెంట్లోని ఫీల్డ్ స్టాఫ్‌కి డివో ఆఫీస్‌కి వచ్చి ముక్క హాజరు వేయటం కష్టతరంగా మారిందని ఫీల్డ్ వర్క్ చేసే పరిస్థితి లేదని, ఫీల్డ్‌లో ఉన్న స్టాఫు సిగ్నల్ ప్రాబ్లం వలన హాజరు నమోదు చేయలేకపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు పి రమేష్ కోశాధికారి సతీష్ ఉపాధ్యక్షులు రాజబాబు, విశ్వనాథ్, బీవీ రమణ, నగర శాఖ అధ్యక్షుడు శ్రీరామ్, కార్యదర్శి సంపత్ కుమార్ కోశాధికారి నజీర్ సివిఆర్ ప్రసాద్ మరియు వివిధ ఎన్జీవో నాయకులు వివిధ డిపార్ట్మెంట్లకు సంబంధించిన ఉద్యోగులు పాల్గొన్నారు.

నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా విజయవాడ నగరంలో పలు చోట్ల ట్రాఫిక్ ఆంక్షలు పోలీసులు విధించారు. ఈనెల 26వతేదీన ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు ట్రాఫిక్ మళ్లించారు. ఈ మేరకు మంగళవారం ఎన్టీఆర్ జిల్లా సీపీ కాంతి రాణా ఓ ప్రకటన విడుదల చేశారు. గురువారం నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రిపబ్లిక్ డే వేడుకలను నిర్వహించనున్నారు. ఈమేరకు వాహనదారులు, నగర వాసులు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకున్నారు. గురువారం 7గంటల నుంచి 12గంటల వరకు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని కమిషనం పేర్కొన్నారు.

లీజుకు లంక భూములు : జేసీ

విశాలాంధ్ర- కంచికచర్ల : కంచికచర్ల మండలం గనిఅత్కూరు గ్రామములో లీజు లంక భూములను అర్హులైన లబ్దిదారులకు లీజుమంజూరు చేయు నిమిత్తం మంగళవారం జాయింట్ కలెక్టర్, రెవిన్యూ డివిజనల్ అధికారి, నందిగామ మరియు తహసిల్దార్, కంచికచర్ల, ఈఈ కేసి డివిజన్, డి ఐ ఓ ఎస్ నందిగామ వారు తనిఖీ చేశారు.

ఎస్ఆర్ పేట సీఐగా వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: విజయవాడ సీసీఎస్ నుంచి సూర్యారావు పేట పోలీస్ స్టేషన్ సీఐగా బీహెచ్.వెంకటేశ్వర్లు నియమిస్తూ ఎన్టీఆర్ జిల్లా సీపీ కాంతి రాణా ఉత్వర్వులు జారీ చేశారు. సూర్యారావు పేట సీఐగా ఉన్న జానకీరామయ్యను ట్రాఫిక్‌కు బదిలీ చేశారు. నేడు వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించనున్నారు.

తిరుపతమ్మ గోపయ్యస్వామి కళ్యాణ స్థలం పరిశీలన

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : స్థానిక తిరుపతమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణం జరగనున్న సందర్భంగా ఏర్పాట్లను ఆలయ ఈఓ జీవీడీఎన్ లీలాకుమార్, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పనులను చేయాలని ఆలయ అధికారులకు తగు సూచనలు ఇచ్చారు.

'సాథి' సహకారంతో బాలికలకు భద్రత

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : బాలికల భద్రత సామాజంలోని ప్రతి ఒక్కరి భాధ్యతని బాలికలు, మహిళలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు "సాథి" (స్నేహితురాలు) ఆన్‌లైన్ రిడ్రెసల్ మెకానిజానికి శ్రీకారం చుట్టడంతో పాటు కళాశాలల్లో కోర్ కమిటీలను ఏర్పాటు చేసి "సాథి" సహకారంతో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్థానిక కలెక్టర్ కార్యాలయంలో శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన బాలికల దినోత్సవ కార్యక్రమానికి కలెక్టర్, ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిలుగా హాజరై "సాథి" ఆన్‌లైన్ గూగుల్ మెయిల్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మట్లాడుతూ బాలికలు, మహిళల సమస్యల పరిష్కారానికి మార్పు ట్రస్ట్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ రూపొందించిన సాథి ఆన్‌లైన్ రిడ్రెసల్ మెకానిజానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. జిల్లాలో సుమారు 300లకుపైగా ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో వేలాది మంది విద్యను అభ్యసిస్తున్నారని, బాలికలు దైనందిక జీవితంలో పలు సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. బాలికలు, మహిళల సమస్యలపై 112, 100 పోలీస్ 181 ఉమెన్ హెల్ప్‌లైన్, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ల ద్వారా సమాచారం అందిస్తే తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కా రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. దిశ యాప్ ద్వారా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటంతో పాటు మార్పు ట్రస్ట్ ద్వారా కళాశాలల్లో ఉత్సహావంతులైన విద్యార్థులు ఒక ఉపాధ్యాయురాలుతో కోర్ కమిటీని నియమించి సాథి wdcwntrdtsaathi @gmail.com గూగుల్ మెయిల్‌లో నమోదైన సమస్యలకు సంబంధించిన సమాచారం ముందుగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ దృష్టికి వస్తుందని, సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత విభాగాలకు తెలియజేసి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం బాలికల దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 20న వైద్య ఆరోగ్య, విద్యా శాఖలు ఆధ్వ ర్యంలో సేవ్ ద చైల్డ్ గర్ల్ అంశంపై నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన బాల బాలికలకు నగదు ప్రోత్సాహకాల సర్టిఫికేట్లను కలెక్టర్, మేయర్, ఎమ్మెల్యేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి మేయర్ అవుతు శైలజారెడ్డి, ఐసీడీఎస్ పీడీ జీ.ఉమాదేవి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, మార్పు సంస్థ డైరెక్టర్ సూయజ్, కార్పొరేటర్లు చెన్నుపాటి ఉషారాణి, ఎం.తిరుపతమ్మ, విజయలక్ష్మి, కే.మల్లేశ్వరి, వై.తిరుపతమ్మ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సీడీపీవోలు జీ.మంగమ్మ, టీ.నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింటు అయిన M/s.టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లి. (TCHFL)విజయవాడ బ్రాంచివారి సూచనలమేరకు యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, నాక్లయింటు వద్దకు ఏలూరు జిల్లా, నూజివీడు, సందమూరిపేట, సాయిబాబాగుడి దగ్గర ప్రస్తుతం ఇక్కంపూడి గ్రామ కాపురస్తుడు(లేటు) పొన్న ముకేష్ గారి కుమారుడు గయుడు గారు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని గుంటూరు జిల్లా, పొన్నూరు టౌను కాపురస్తుడు సంకా మల్లిఖార్జునరావు గారి వద్ద నుండి కొనుగోలు చేయుటకు ది.20-01-2023న విక్రయ ఖరారుపడి అట్టి ఆస్తి కొనుగోలు నిమిత్తం నాక్లయింటును ఋణం కొరకు సంప్రదించియున్నారు. సదరు సంకా మల్లిఖార్జున రావుగారు సదరు ఆస్తికి చెందిన ఒరిజినల్ దస్తావేజు 4421/1965ను పోగొట్టుకున్నానని సదరు విషయమై పేపరులో ప్రకటన ఇచ్చిన సమయంలో సర్వే నెం. తప్పుగా నమోదు కాబడినదని, అట్టి దస్తావేజుకు సంబంధించి విజయవాడ టు టౌన్ పోలీసు వారి వద్ద నుండి నాన్ ట్రేసబుల్ సర్టిఫికేట్ నెం.1520360200614గా పొందియున్నానని తెలిపి సదరు ఆస్తిని పొన్న గయుడు గారికి విక్రయించుటకు ఖరారుపడియున్నారు. కావున అట్టి ఆస్తిని సదరు పొన్న గయుడు గారు కొనుగోలు నిమిత్తం నాక్లయింటు వద్ద నుండి ఋణం పొందబోవు చున్నందున ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు, తనఖాలు, తాకట్లు, కోర్టు జప్తులు, క్లెయిములు, సెక్యూరిటీలు, హక్కులు, వగైరాలు ఉన్నచో 7రోజుల లోపు వ్రాత పూర్వకంగా ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయవలెనని గడువు లోపల ఎటువంటి క్లెయిములు తెలియజేయనిచో నిష్ఫే ఆస్తిగా భావించి లోను మంజూరుచేయబడును మరియు గడువు అనంతరమువచ్చు ఆక్షేపణలు,వగైరాలు నాక్లయింటు హక్కులను బైండుచేయబడవు.

షెడ్యూలు: ప్రస్తుతం యన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ ఆర్.డి., నున్న సబ్.డి॥, విజయవాడ రూరల్(మం), కొత్తూరు తాడేపల్లి గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన తాడేపల్లి గ్రామం తాలూకు ఆర్.యస్. నెం.174/4సి మరియు 162/1బి దాఖలా చ.గ. 290.4లు స్థిరాస్తి నివేశన స్థలమునకు హద్దులు. **తూర్పు:** పోతురాజు చిన్న వెంకటేశ్వరరావుగారి ఆస్తి, **దక్షిణం:** పంచాయితీ బజారు, **పడమర:** సంకా మల్లిఖార్జునరావు గారి ఆస్తి, **ఉత్తరం:** రాజులపాటి సుబ్బయ్యగారి ఆస్తి.యీ నాలుగు హద్దుల మధ్య చ.గ.290.4లు స్థిరాస్తి నివేశనా స్థలములో జాయింటు అవిభాజ్యపు హక్కుగల చ.గ.41.48లు జాయింటు స్థలమున్నూ మరియు

2వ అయిటం కట్టడం వివరం: పై షెడ్యూలు దాఖలా మొత్తం స్థలములో **"లక్ష్మీటవర్స్"** అను పేరుతో నిర్మించుచున్న గృహ సముదాయము కట్టడములలో ఫస్ట్ ఫ్లోర్‌లోని ఫ్లాట్ నెం.ఎఫ్2 అసంపూర్తి నిర్మాణములోగల ఫ్లాటు కట్టడములకు హద్దులు. **తూర్పు:** కామన్ కారిడార్, లిఫ్ట్ మరియు స్టెయిర్‌కేస్, **దక్షిణం:** ఈ ఫ్లాటుకు సంబంధించిన బాల్కనీ,**పడమర:** ఈఫ్లాటుకు సంబంధించిన బాల్కనీ,**ఉత్తరం:** ఈ ఫ్లాటుకు సంబంధించిన బాల్కనీ.

సాంబేలు ఆంజనేయ ప్రసాద్, అడ్వకేట్
AP LAW FIRM, డోర్.నెం.54-15-13, మధు టవర్స్, ఫ్లాట్ నెం. ఎఫ్.ఎఫ్.2, భారతీ నగర్, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంక్ ప్రక్కన, విజయవాడ.సెల్: 9949533987
విజయవాడ. తేది: 24-01-2023

NOTICE
IN THE COURT OF THE II ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
I.P.NO: 89 / 2022

BETWEEN:-
Thota Srinivasa Rao, S/o. Mohana Rao, R/o. Door No: 2-745/5, Flat No: 501, 5th Floor, Old Age Home Road, 1st Lane, Shiridi Nagar, Kanuru, Vijayawada - 520007. **- Petitioner**
AND
Pulapa Uma Maheswara Rao, S/o. Venkata Rao, R/o. Door No: 3-2-65/1, Rajula Street, Ramarajya Nagar, Vijayawada-520001. **- Respondent No.4**

The above said Respondent No.4 is hereby directed to appear before the Hon'ble court on **10-02-2023 at 10.30 A.M** personally or through advocate and to file counter if any against the above petition, if not the Respondent No.4 will be decided exparte.
Hearing Date: 10-02-2023

Shaik Abdul Rasheed, *B.Com, LL.M.,*
Advocate,
Door No: 30-9-12,
Namburi Vari Street,
Durga Agraharam,
Eluru Road,
Vijayawada - 520 002.
Cell No - 9440496347

ప్రకటన

నా క్లయింటు, **ప్రశాంత్ కుమార్ సంఘవి, తండ్రి: పుఖ్‌రాజ్ సంఘవి,** నివాసం: డోరు నెం.11-16-33, ఫ్లాటు నెం.204, శ్రీలత టవర్స్, సింగరాజువారి వీధి, విజయవాడ-1, వారి వలన సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా:

నా క్లయింటు యొక్క ఆస్తికి సంబంధించిన విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి **ఆఫీసులో నెం. 3315/2010రుగా** గల దస్తావేజును రిజిష్టరు అయిన దరిమిలా నా క్లయింటు యొక్క సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములతో అనుభవించుచున్నారు. యిట్టి స్థితిలో పైన ఉదహరించిన **దస్తావేజు నెం. 3315/2010, ది.19.01.2023న** అతని యింటివద్ద నుండి నెహ్రూ బొమ్మ సెంటరు దగ్గర, షేక్ రాజా హాస్పటలు ప్రక్కన ఫోటోస్టాట్ కాపీలు తీయించుకొను సమయమున నా క్లయింటు తాలూకు **దస్తావేజు నెం.3315/2010** గైర్‌విల్లు అయినది. నా క్లయింటు దస్తావేజు కొరకు ప్రయత్నించినను దొరికియుండలేదు. కనుక పై దస్తావేజు ఎవరికైన దొరికిన యెడల యీ క్రింద ఉదహరించిన చిరునామాకు అందజేయగలరు. మరియు పైన ఉదహరించిన దస్తావేజును ఆసరాగా చేసుకొని ఎట్టి క్రయ విక్రయము, తనాఖా, దఖలు చేసిన యెడల అన్నియూ నా క్లయింటును బైండు చేయజాలవనిన్నీయు, యీ ప్రకటన ద్వారా తెలియజేయటమైనది.

నరహరిశెట్టి జ్యోతి, న్యాయవాది
డోరు నెం.20-6-22, 1వ లైను,
రామలింగేశ్వర పేట, విజయవాడ-520003
సెల్ నెం: 9346859759

ప్రకటన

నా క్లయింటు అయిన ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ టౌన్, గవర్నరుపేట, డైమండ్ కాంప్లెక్స్ దగ్గర, జె.డి.హాస్పటల్ రోడ్డు, డోరు నెం.27-22-63రు కాపురస్తులు అయిన **పదమాజీ మాలి గారి కుమారుడు ప్రకాష్ మాలి** గారి సంజాయిషీ పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా..

నా క్లయింటు అయిన **ప్రకాష్ మాలి** గారు విజయవాడ టౌన్, విద్యాధరపురం, రాచకొండ వారి వీధి కాపురస్తులు అయిన **మద్దాల వెంకట్రావు** గారి కుమారుడు **మద్దాల శివ నాగేశ్వరరావు** గారి తాలూకు స్థిరాస్తి అనగా విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి ఆఫీసు నందు 1వ పుస్తకం, **దస్తావేజు నెం.5120/2014రుగా** రిజిష్టరు చేయించుకున్న విక్రయ దస్తావేజు రీత్యా వారికి సంక్రమించిన విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ టౌన్, గాంధీనగర్, ముదునూరి వారి వీధిలోని రెవిన్యూ వార్డు నెం.8, పాత యన్.టి.యస్.నెం.769రు, దర్మిలా యన్.టి. యస్.నెం.769/ఏ పార్టు, పాత **అసెస్మెంటు నెం.110455రు,** డోరు నెం.26-22-4ర్లు దాఖలా చ.గ.56.47లు స్థిరాస్తి నివేశన స్థలము, అందులోని గ్రౌండు మరియు ఫస్టు ఫ్లోర్లుగా గల ఆర్.సి.సి.డాబా యింటిని సదరు మద్దాల శివ నాగేశ్వరరావు గారి వలన నా క్లయింటు విక్రయ ఖరారు పొంది యున్నారు. అయితే సదరాస్తిని పైన తెల్పిన విధముగా నా క్లయింటు విక్రయ ఖరారు పొంది యున్నారనియు, సదరాస్తిపై ఎవరికైన ఎటువంటి క్లయిములు గానీ, ఆక్షేపణలు గానీ, తనఖాలు లేదా అప్పులు, యితరత్రా ఏమైనా అగ్రిమెంట్లు వగైరాలు ఏమైనా యున్న యెడల యీ రోజు నుండి 14 రోజులలోగా యీ దిగువ తెలిపిన చిరునామాకు రిజిష్టరు పోస్టు ద్వారా తెలియ పరచగలరు. తదుపరి సదరాస్తిపై ఎవరైనా ఏమైనా ఆక్షేపణలు గానీ, అభ్యంతరములు గానీ, క్లయిములు గానీ చేసిన యెడల అట్టివి ఏమి యున్నూ నా క్లయింటును బైండు చేయజాలవు అని యిందుమూలముగా యావన్మందికి తెలియచేయడమైనది.

నెల్లూరి శ్రీనివాస్, M.L., అడ్వకేట్,
డోరు నెం.14-20-16, కోట వారి కాంప్లెక్స్,
గాంధీనగర్, విజయవాడ - 520003.
మొబైల్ : 9848086160,8096190898.
విజయవాడ, 24-01-2023

26 నుంచి రమేష్ హాస్పిటల్స్ అధ్వర్యంలో ఇండో బ్రిటిష్ హాస్పిటల్ లో గుండె జబ్బుల వైద్య సేవలు

విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట) : రమేష్ హాస్పిటల్స్ నాణ్యమైన గుండె జబ్బుల వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయటానికి స్థానిక శ్రీనివాస నగర్ బ్యాంకు కాలనీ నందుగల ఇండో బ్రిటిష్ హాస్పిటల్ లో ప్రత్యేకమైన గుండె జబ్బుల వైద్య విభాగంతో వైద్య సేవలను 26వ తారీకున ఉదయం 11 గంటలకు చైర్మన్ ఎమ్మెస్ రామ్మోహన్ రావు చేతుల మీదుగా హాస్పిటల్ ను ప్రారంభించనున్నట్లు రమేష్ హాస్పిటల్స్ చీఫ్ కార్డియాలజిస్ట్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు తెలిపారు. నగరంలోని రమేష్ హాస్పిటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ప్రప్రథమంగా ఇండో బ్రిటిష్ హాస్పిటల్స్ నందుగల 50 పడకలను పూర్తిస్థాయిలో క్లౌడ్ డాక్స్ (టెలి ఐసియు) కు అనుసంధానం చేయడం ద్వారా 24 గంటలూ రోగులు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో వుంటారని అంతర్జాతీయ స్థాయి మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, అత్యాధునిక క్యాత్ లాబ్ సౌకర్యం ఏర్పాటు చేశామని, ఈ హాస్పిటల్ నందు ఇన్సూరెన్స్ పేషెంట్లతోపాటు కార్పొరేట్ రంగ ఉద్యోగులకు, డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్, జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ లబ్ధిదారులకు నాణ్యమైన వైద్య సేవలను అందిస్తారని,ఆరోగ్య శ్రీ కార్డ్ లేని " బిలో పావర్టీ లైన్" లో ఉన్న పేషంట్లకు ఆరోగ్య భాగ్యం స్కీంలో రాయితీలతో వైద్య సేవలందిస్తామని డాక్టర్ రమేష్ బాబు తెలియజేశారు. సీనియర్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ పి.వి.ఎస్.ఎస్.శ్రీనివాస్ ప్రసాద్ ఆధ్వర్యంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ షహనాజ్, ఎలక్ట్రో ఫిజియాలజిస్ట్ డాక్టర్ చంద్రమౌళి, చిన్నపిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ జ్యోతి ప్రకాష్, డాక్టర్ వాసుదేవ్ సీనియర్ గుండె శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ జయరాంపాయ్, డాక్టర్ శివప్రసాద్ మరియు డాక్టర్ భరత్ సిద్ధార్థ లతో కూడిన వైద్య బృందం హార్ట్ ఎటాక్, స్టెంట్ యాంజియోప్లాస్టీ, బైపాస్ సర్జరీ, వాల్వ్ మార్పిడి సర్జరీ, పేస్ మేకర్, రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్, హార్ట్ ఫెయిల్యూర్ కు సీ.ఆర్.టీ.డి చిన్నపిల్లలలో వచ్చేగుండె జబ్బులకు ఈ నిపుణులైన వైద్య బృందం వైద్య సేవలు అందిస్తారని వివరించారు.

రిపబ్లిక్ డే సందర్భంగా పేదలకు ఆహార పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట) : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్లాట్ ఫామ్ 65 రెస్టారెంట్ 1000 మంది పేదలకు ఆహారం పంపిణీ చేసింది. ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించాలన్న ఆలోచనతో "సెలబ్రేటింగ్ యూనిటీ, న్యూరిషింగ్ కమ్యూనిటీ" చొరవ తీసుకొని తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో నిరాశ్రయులకి దగ్గరకు అనాథాశ్రమాలకు వెళ్లి అక్కడి ఆశ్రయులకు ఆహారం అందజేసారు. దీనిపై మాట్లాడిన సంస్థ ఎండీ సద్గుణ్ పాథా "సమాజాన్ని మెరుగుపరిచడానికి వచ్చే ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలన్నే మా ధ్యేయమన్నారు. పేదలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఇవ్వాలన్నదే మా కోరికని, ఈ ఆలోచనలతో గొలుసును ప్రారంభించడం, పోషకాహార లోపాన్ని నిర్మూలించడంపై దృష్టి పెట్టడమే మా ఈ చిన్న ప్రయత్నమని వివరించారు. దీని ద్వారా దేశంలో చాలా మంది ప్రజల్లో మార్పు వచ్చి పేదలకు సహాయం చేస్తారని ఆశిస్తున్నామని, ఇతరులకు సహాయం చేయగలిగినప్పుడే మనలో నిజమైన ఆనందం కలుగుతుందని, అందుకే ఈ గణతంత్ర దినోత్సవాన్ని ప్రత్యేకంగా జరుపుకోవాలని మేము నిర్ణయించుకున్నామని"అన్నారు.

ఏపీ, తెలంగాణాల్లో శక్తివంతమైన, అత్యుత్తమమైన వి గిగానెట్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): సుప్రసిద్ధ టెలికామ్ సేవల ప్రదాత, వి తమ నెట్‌వర్క్ అనుభవాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలోని వినియోగదారులకు మెరుగుపరిచేందుకు పలు కార్యక్రమాలను వేగవంతమైన స్పీడ్స్ కోసం ప్రారంభించింది. వి ఇప్పుడు అదనపు 1800 మెగా హెర్ట్జ్ స్పెక్ట్రమ్ బ్యాండ్‌ను తమ 11వేల సైట్స్ వద్ద ఈ రెండు రాష్ట్రాల్లో అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మరింత వేగవంతమైన డౌన్‌లోడ్స్, అప్‌లోడ్స్, స్ట్రీమింగ్‌ను అందిస్తుంది. ఈ సందర్భంగా వోడాఫోన్ ఇండియా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్నాటక క్లస్టర్ బిజినెస్ హెడ్ సిద్ధార్థ జైన్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రచారానికి అనుగుణంగా, ఏపీ, తెలంగాణాలోని తమ వినియోగదారులందరినీ తమ అత్యున్నత, ఆధునీకరించిన నెట్‌వర్క్ అనుభవాలను రెండు రెట్ల వేగంతో వి గిగానెట్‌పై ఆస్వాదించాల్సిందిగా కోరుతున్నామని అన్నారు.

హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

విశాలాంధ్ర-విజయవాడ లీగల్ : ఒక వ్యక్తిని హత్య చేసిన కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధిస్తూ విజయవాడ 8 వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.లక్ష్మి మంగళవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం విజయవాడ, అజిత్ సింగ్‌నగర్, లూనా సెంటర్‌కి చెందిన నేలటూరి రవి, నేలటూరి కోటి 2013 మే 15 న రాత్రి 9 గం॥ల సమయంలో ఫిర్యాది ఇంటి ముందు మద్యం సేవిస్తున్నారు. అది గమనించిన ఫిర్యాది భర్త జాన్ ఇక్కడ మద్యం తాగద్దని చెప్పగా నిందితులు జాన్‌తో గొడవ పడి నువ్వు మాకు సలహాలు చెపుతావా నిన్ను చంపేస్తామని బెదిరించారు. చుట్టుప్రక్కల వారు రావడంతో అక్కడి నుండి వెళ్ళిపోయారు. కాగా, మరుసటి రోజు మధ్యాహ్నం జాన్ కండ్రిక కాలనీలో తన మిత్రుడితో మాట్లాడుతుండగా లూనా సెంటర్‌కి చెందిన నేలటూరి రవి అలియాస్ ముక్కల రవి (48), వాంబే కాలనీకి చెందిన మట్టపర్తి శివ దుర్గా ప్రసాద్ అలియాస్ కోతల శివ (36), శాంతీనగర్‌కి చెందిన చీపురుపల్లి దుర్గా ప్రసాద్ అలియాస్ మొద్దు ప్రసాద్ (48)లు జాన్ మీద కత్తులతో దాడి చేసి హతమార్చారు. మృతుని భార్య నున్న పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి పై నిందితులతో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరు పరిచారు. ఈ కేసులో ఏ.పి.పి జి.కళ్యాణి 16 మంది సాక్షులను విచారించగా పై ముగ్గురు నిందితులపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. మిగిలిన ముగ్గురిలో ఒక నిందితుడు చనిపోగా మరో ఇద్దరిపై నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టివేస్తూ తీర్పునిచ్చారు.

స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ టోర్నీకి నున్న జడ్పీ హైస్కూల్ విద్యార్థి రామ్‌చంద్ ఈశ్వర్



విశాలాంధ్ర-విజయవాడ (స్పోర్ట్స్) : విజయవాడ రూరల్ మండలం నున్నలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న దాసరి రామ్ చంద్ శ్రీ ఈశ్వర్ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వజ్రాల భూపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు కర్నూలులో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జిఎఫ్ఐ) అంతర్ జిల్లాల ఫెన్సింగ్ పోటీలలో కృష్ణా జిల్లా అండర్ - 17 జట్టుకు తమ విద్యార్థి ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 21వ తేదీన విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో నిర్వహించిన ఎంపికలలో అండర్ - 17 కేగటిరిలో ఫెన్సింగ్ ఫాయల్ విభాగంలో ప్రతిభ చూపిన రామ్‌చంద్ శ్రీ ఈశ్వర్ కృష్ణాజిల్లా జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రామ్‌చంద్ శ్రీ ఈశ్వర్‌ను హెచ్‌ఎం భూపాల్‌రెడ్డి అభినందించారు. అలాగే రామ్‌చంద్ శ్రీ ఈశ్వర్‌ను క్రీడలలో ప్రోత్సహిస్తున్న ఫిజికల్ డైరెక్టర్ ముత్యాల వెంకటేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు విజయ్ వర్మను కూడా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

లక్ష మందితో ముదిరాజ్ సమస్యలపై సభ

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలో 20 లక్షల మందికి పైగా ఉన్న ముదిరాజ్ కులస్తులకు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం తగినంత గుర్తింపు నివ్వడం లేదని అంతే కాకుండా ప్రజాప్రతినిధులు కుడా తమను నిర్లక్ష్యం చేస్తున్నారని ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చప్పిడి కృష్ణమోహన్ ముదిరాజ్ అవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బందారు వెంకటరాజు ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ముదిరాజ్ కాలెండర్ ఆవిష్కరణ సభ నిర్వహించారు. క్యాలెండర్‌ను స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఇతర ముదిరాజ్ సంఘ నాయకుల చేతుల మీదుగా విష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం నిధులు,పథకాలు,పదవుల్లో తమ వాటాను దక్కించుకునేందుకు ముదిరాజ్ సంఘం భవిష్యత్ కార్యచరణ శ్రీకారం చుట్టనున్నదన్నారు.బిసి కార్పొరేషన్లకు పాలకవర్గాలను కొనసాగిస్తూ నిర్ణయించడం హాస్యాస్పదమన్నారు.బిసి కులాలకు ఒక్క రూపాయి కూడా మేలు జరగలేదన్నారు.జగన్ పాదయాత్రలో ఎంతో ఆశతో వినతి పత్రాలు సమర్పించిన నాయకులకు , కుల సమస్యలపై అవగాహన , కులంలో గుర్తింపు పొందిన వారికి పదవులు ఇవ్వకుండా పైరవీకారులకు , స్థానిక ఎమ్మెల్యేలు సిఫార్సు చేసిన వారికి పదవులిచ్చారని విమర్శించారు.ప్రతి నియోజక వర్గంలో ముదిరాజ్ కులస్తులకు ముదిరాజ్ భవన్ నిర్మాణానికి 25 సెంట్ల స్థలం,50 లక్షల రూపాయల నిధులు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులెదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించటానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు యాదవ్,ముదిరాజ్ ఉద్యోగుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాస్ ముదిరాజ్,మానవ హక్కుల సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ మల్లాది ప్రసాద్ మాదిగ,సంఘం జిల్లా నాయకులు పిట్టు వెంకటరామయ్య,ముచ్చు నాగేంద్ర,తేనె సులోచన ,తదితరులు పాల్గొన్నారు.

మహిళా మల్లయోధులకే వేధింపులు తప్పడం లేదు

విశాలాంధ్ర- విజయవాడ : మహిళల రక్షణ కోసం దేశంలో అనేక చట్టాలు ఉన్నప్పటికి వారిపై అరాచకాలు తగ్గడం లేదని మన దేశంలో మహిళా మల్ల యోధులకు కూడా వేధింపులు గురవుతున్నారని ఆంధ్రప్రదేశ్ మహిళా కమీషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. విజయవాడ రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఐఎంఏ హాలులో జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభకు ముఖ్య అతిధిగా హాజరైన ఆమె బాలికల సంరక్షణకు సంబంధించిన ఫోటో గ్యాలరీని వాసిరెడ్డి పద్మ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాలికలను సంరక్షించుకోలేని ఏ సమాజం సమానత్వాన్ని, స్వయం సమృద్ధిని సాధించలేదన్నారు. శిశు సంక్షేమానికి, మహిళల సర్వతోముఖాభివృద్ధికి అనేక పథకాలు అమలవుతున్నప్పటికి ఆశించిన ఫలితాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూనిసెఫ్ అంచనాల ప్రకారం ప్రపంచంలో పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కులు రావాలంటే మరో వంద సంవత్సరాలు పడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో భ్రూణహత్యలు, శిశుమరణాలు గణనీయంగా తగ్గాయని మహిళా, శిశు సంక్షేమంలో ఆంధ్రప్రదేశ్ అగ్ర స్థానంలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత మూడున్నర సంవత్సరాలుగా మహిళా శిశుసంక్షేమ పథకాలకు రూ. లక్షా 20వేల కోట్ల రూపాయలు వ్యయం చేసిందని ఆమె చెప్పారు. డీఐజీ ఆఫ్ పోలీస్ (కమ్యూనికేషన్స్) ఎన్.ఎస్.జె. లక్ష్మి మాట్లాడుతూ, బాలికలను లక్ష్మీదేవిగా భావించే సమాజం మనదని అయితే కొడుకుల మోజులో కుమార్తెలను అనేక కుటుంబాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.బాలికలు ప్రణాళిక బద్ధంగా చదవటం కారణంగా విద్యారంగంలో కూడా బాలుర కన్నా బాలికలే బాగా రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ డాక్టర్ ఉమ మిక్కిలినేని, యూనిట్ హెడ్ గుణశేఖర్, రీజనల్ మేనేజర్ రావి శ్రీనివాసరావు, డాక్టర్ పి.వి. దుర్గారాణి , ప్రముఖ విద్యావేత్త వెంకట్ పూలబాల, ప్రముఖ పెయింటర్ రాము అళహరి తదితరులు పాల్గొన్నారు. జాతీయ బాలికా దినోత్సవ వేడుకల సందర్భంగా నగరంలోని పాఠశాలల బాలికలకు క్విజ్, వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు.ఢిల్లీ పబ్లిక్ స్కూల్, జాక్ అండ్ జిల్, ఐకాన్ పబ్లిక్ స్కూల్, నలందా విద్యానికేతన్ , కేంద్రీయ విద్యాలయం తదితర పాఠశాలల నుంచి బాలికలు ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతులకు ధాన్యం అమ్మిన నగదు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర-ఎ కొండూరు : తమది రైతు సంక్షేమ ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వం రైతులను దివాళ తీయిస్తుందని కౌలు రైతు సంఘం రైతు సంఘం నాయకులు గిరిజన సంఘం నాయకులు ఆరోపించారు. ఏ కొండూరు వ్యవసాయం మార్కెటింగ్ యాడ్ ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రెండున్నర సంవత్సరాలు గడిచిన నేటికీ డబ్బులు చెల్లించకపోవడంతో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రైతులతో కలిసి మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఏ కొండూరు పాత కొండూరు కొండూరు తండా అట్లప్రగడ గ్రామాలకు చెందిన 14 మంది రైతులు వద్ద 2021లో ఏ కొండూరు మార్కెటింగ్ యాడ్‌లో ధాన్యం కొనుగోలు చేశారని, అప్పటినుండి ఇప్పటివరకు 14 మంది రైతులకు 11 లక్షల వరకు డబ్బులు చెల్లించాల్సి ఉండగా ఆ డబ్బులు చెల్లించలేదని అన్నారు. ఈ విషయమై రైతులు ఏ కొండూరు తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలు చేశామని, విజయవాడ వెళ్లి స్పందన కార్యక్రమంలో తమ గోడును కలెక్టర్‌కు కూడా విన్నవించుకున్నారని అయినా ఈ సమస్యకు పరిష్కారం లభించడం లేదని ఆరోపించారు. ధర్నా అనంతరం తమ డిమాండ్లతో కూడిన వింత పత్రాన్ని తాహసిల్దార్ చాట్ల వెంకటేశ్వరరావు కు ప్రజాసంఘాల నాయకులు రైతులు వినతిపత్రాన్ని అందజేశారు అలానే రైతులకు డబ్బులు చెల్లించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మార్కెటింగ్ సూపర్వైజర్ కే నాగ దుర్గారావు పై ఏ కొండూరు ఎస్సై కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు ఎస్ రామకృష్ణారెడ్డి కౌవులు రైతు సంఘం మండల కార్యదర్శి పి ఆనందరావు, సీఐటీయూ మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు గిరిజన సంఘం నాయకులు బి గోపిరాజు డి రాముడు ఎం కృష్ణ ప్రసాద్ రామకృష్ణ రైతులు వి. శ్రీను బి. కేళ వి. వెంకటేశ్వరరావు కే. ముత్తయ్య వే. సునంద రావు బి. సక్రు కే.జమల తదితరులు పాల్గొన్నారు.

25న శ్రీశైలంలో నగరాల అన్నదాన వసతిసత్రం నిర్మాణపనుల ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): శ్రీశైలంలో శ్రీశైల క్షేత్ర భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వార్ల నగరాల కులస్థుల నిత్య అన్నదాన వసతి సత్రం నిర్మాణం ప్రారంభోత్సవం 25న బుధవారం ఉదయం 9.45 గంటలకు జరుగుతుందని నగరాల కులస్థుల నిత్య అన్నదాన వసతి సత్రం కమిటీ ప్రధాన కార్యదర్శి కె యస్ జగన్, అధ్యక్షులు నల్లాన సూర్యా రావు, కార్యవర్గ సభ్యులు లింగిపల్లి రామకృష్ణ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పశ్చిమ శాసన సభ్యులు వెలం పల్లి శ్రీనివాస రావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, ఆలయ కార్య నిర్వహణ అధికారి లవన్న ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొంటారని చెప్పారు. మంగళవారం విజయవాడ లోని కార్యాలయంలో వారు ఇందుకు సంబంధించిన బ్రోచర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరాల కులస్థుల చిరకాల స్వప్నం, దక్షిణ కాశీగా పిలవబడే శ్రీశైల క్షేత్రం నందు అన్నదాన వసతి సత్రం నిర్మాణం కోసం స్థలం కేటాయించేందుకు కృషి చేసిన మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస రావు కు రుణపడి ఉంటామని స్పష్టం చేశారు. శ్రీశైలం లో 50 సెంట్ల స్థలం లో ఈ సత్రం నిర్మాణం జరుగుతోందని, వచ్చే జూలై నాటికి దీనిని పూర్తి చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు.

అకిన్‌అయో ఐవీ ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): సృజనాత్మకత ఆధారంగా పనిచేసే అంతర్జాతీయ ఫార్మాస్యూటికల్ సంస్థ అయిన గ్లెన్మార్క్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ (గ్లెన్మార్క్) , కీమోథెరపీ వల్ల వచ్చే వికారం , వాంతుల నివారణకు ఉపయోగించే , మన దేశంలో మొట్టమొదటి ఐవీ ఇంజెక్షన్ ఫార్ములేషన్ అయిన అకినియో ఐవీని ఆవిష్కరించింది . స్విస్ బయోఫార్మాగ్రూప్ కంపెనీ అయిన హెల్సిన్నో ఇందుకోసం ప్రత్యేకంగా లైసెన్సింగ్ ఒప్పందం చేసుకుంది . అకినియో ఐవీ అనేది ఒక ఫిక్స్ డోస్ కాంబినేషన్ . ఇందులో ఫాస్నెట్యుపిటాంట్ (235 ఎంజీ) , పాలోనోసెట్రాన్ (0.25 ఎంజీ) ఉంటాయి . ఇది సింగిల్ డోస్గా వచ్చి , డైల్యూట్ చేస్తే సిద్ధంగా ఉండే ఐవీ ఇంజెక్షన్ . దీన్ని కీమోథెరపీ సైకిల్ ప్రారంభానికి 30 నిమిషాల ముందు ఇవ్వాలి . అప్పుడు తీవ్రంగా , ఆ తర్వాత కూడా వచ్చే వాంతులు ,వికారాన్ని నివారిస్తుంది.

విజయవాడ డివిజన్‌లో 130 కి.మీ వేగంతో రైలు పరుగు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఇక నుండి విజయవాడ - దువ్వాడ మధ్య గంటకు గరిష్ఠంగా 130 కి.మీ వేగంగా వెళ్ళటానికి దక్షిణ మధ్య రైల్వే అధికారులు అనుమతించారు. 330.94 రూట్ కిమీల దూరం మేర వున్నా ఈ సెక్షన్‌లో గరిష్ఠంగా గంటకు 130 కి.మీ వేగంతో నడిచే రైళ్లను నడపడానికి ఆధునీకరించబడింది. ఈ ప్రక్రియతో జోన్‌లోని కీలకమైన స్వర్ణ చతుర్భుజి స్వర్ణ వికర్ణ విభాగాల లోని ట్రాక్ గరిష్ఠ వేగాన్ని గంటకు 130 కిమీకి పెంచడం పూర్తి చేసినట్లు అయ్యింది.ప్రస్తుతం జోన్ మొత్తం మీద రికార్డు స్థాయిలో 1,743.4 రూట్ కిలోమీటర్ల పరిధిలో గరిష్ఠంగా గంటకు 130 కి. మీ. వేగంతో రైళ్లను నడపడనికి వీలుపడుతుంది.గత ఏడాది సెప్టెంబర్ నెలలో 744 రూట్ కి.మీ.లు మేర స్వర్ణ వికర్ణ విభాగాలైన అయిన బల్హార్షా కాజీపేట- గూడూరులో గరిష్టంగా 130 కి.మీ. వేగాన్ని పెంచడానికి అనుమతి లభించింది.అలాగే స్వర్ణ చతుర్భుజి విభాగాలైన వాడి- గుంతకల్ - రేణిగుంట మార్గాల్లో 536 రూట్ కి.మీ. మేర కుడా అనుమతి లభించింది. వీటితోపాటు, ఇదివరకే సికింద్రాబాద్- కాజీపేట మధ్య 132 రూట్ కిలోమీటర్ల హై డెన్సిటీ నెట్వర్కు 130 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడపడానికి అనుమతి ఇవ్వబడింది. దీనికి అనుగుణంగా దక్షిణ మధ్య రైల్వే (విజయవాడ- దువ్వాడ)లోని స్వర్ణ చతుర్భుజి స్వర్ణ వికర్ణ మార్గంలో చివరి సెక్షన్ యొక్క సిగ్నలింగ్ మరియు ట్రాక్ పునరాభివృద్ధి పనులు జరిగాయి

గంపలగూడెంలో జాతీయ బాలిక దినోత్సవం

విశాలాంధ్ర-గంపలగూడెం : గంపలగూడెం హైస్కూల్లో మంగళవారం ప్రధానోపాధ్యాయులు జమలయ్య, అంగన్వాడి సూపర్వైజర్ ముని లక్ష్మి ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు 7,8,9 తరగతి బాలికలనుద్దేశించి మాట్లాడుతూ స్త్రీలపై జరుగుతున్న హత్య, అత్యాచార యత్నాలు, లైంగిక వేధింపులు ఈ సమాజంలో జరుగు తున్నాయన్న సంగతి మనకందరకు తెలిసిందేనని అందువల్ల బాలికలు జాగ్రత్తగా ఉండాలని అన్నారు . ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు విద్యార్థినులు పాల్గొన్నారు.

తెల్లదేవరపల్లిలో గడపగడపకూ కార్యక్రమం

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండలం తెల్లదేవరపల్లిలో మంగళవారం తిరువూరు శాసనసభ్యులు కె.రక్షణనిధి కొనసాగించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ఎస్సీవాడలో పర్యటించి, పలు కుటుంబాలతో మాట్లాడారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూరే దిశగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని వివరిస్తూ, ఇందుకు సంబంధించిన కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పి.మెర్సీ వనజాక్షి, ఎంపీటీసీ సభ్యురాలు చాట్ల మణి, ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, ఈవోఆర్డీ ఝాన్సీలక్ష్మి, గ్రామ నాయకులు గంటల నాగాచారి తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేటలో జాతీయ బాలికాదినోత్సవం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సెయింట్‌థెరిస్సా బాలికోన్నత పాఠశాలలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు బాలికలకు బాల్య వివాహాలు, పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయా కార్యక్రమాల్లో తమవంతు బాధ్యత నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ అభివృద్ధి నిరోధకాలు..

విశాలాంధ్ర-వీరులపాడు: జిల్లా పరిషత్ హైస్కూల్ నందు జాతీయ బాలికాల దినోత్సవం సందర్భంగా బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలపై ఎంపీటీసీ మండూరు ప్రకాష్ రావు వీరులపాడు గ్రామంలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు,బాల కార్మిక వ్యవస్థ వంటివి అభివృద్ధి నిరోధకలు గా మారయని వాటిని అరికట్టేందుకు సహకరించాలని వీరులపాడు గ్రామ సర్పంచ్ కందమాల సురేష్ బాబు కోరారు. అనంతరం వ్యాసరచన డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వట్టి కొండ చంద్రమోహన్ , పాఠశాల ఉపాధ్యాయులు, మెడికల్ ఆఫీసర్ నందిని, ఏఎన్ఎం లు, ఆశ వర్కర్ లు అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

26న కేబీఎన్‌లో ఆర్యవైశ్య వివాహ పరిచయ వేదిక

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఈనెల 26న విజయవాడ కొత్తపేటలోని కేబీఎన్ కళాశాలలో ఆర్య వైశ్య ఉచిత పరిచయ వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వాసవి విజయవాడ గౌరవ అధ్యక్షులు తూనుగుంట్ల శ్రీనివాస్, అధ్యక్షులు తేలప్రోలు వీరయ్య గుప్త, కార్యదర్శి చిట్ట అమర్ సుధీర్, కోశాధికారి లక్ష్మీ నారాయణ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు. వాసవి విజయవాడ సంస్థ ఆర్య వైశ్యులకు సేవ చేయుట కోరకు 1991 లో స్థాపించబడి ఇప్పటికి 32 సంవత్సరములు గడిచాయని తెలిపారు. మంగళవారం వారు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సంస్థ ప్రతి సంవత్సరం జనవరి జూలై నెలలో వివాహ పరిచయ వేదికలు, 2012 నుండి పునర్వివాహ పరిచయ వేదికల క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నదన్నారు. ఈ క్రమంలో 62వ ఉచిత వివాహ పరిచయ వేదిక ను 26న గురువారం ఉదయం 10 గంటలకు కేబీఎన్ కళాశాలలో, 17వ ఆర్య వైశ్య పునర్వివాహ పరిచయ వేదికను మధ్యాహ్నం రెండుగంటలకునిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ఆర్య వైశ్యులకు పూర్తిగా ఉచితంగా వధూవరులను ఒకే వేదిక పైకి తీసుకుని రావాలనేది సంస్థ సంకల్పం. ఈ కార్యక్రమము పూర్తిగా డిజిటల్ రూపంలో జరుగుతుంది. సమావేశంలో వాసవి విజయవాడ గౌరవ అధ్యక్షులు తూనుగుంట్ల శ్రీనివాస్, అధ్యక్షులు తేలప్రోలు వీరయ్య గుప్త, కార్యదర్శి చిట్టఅమర్ సుధీర్, కోశాధికారి లక్ష్మీ నారాయణ, కన్వీనర్ జల్లూరి నాగ శ్రీనివాసరావు, పరిచయ వేదిక కన్వీనర్ యు.వి. పుల్లారావు పాల్గొన్నారు

పెప్సీ బ్రాండ్ అంబాసిడర్ సూపర్ స్టార్ యష్ బ్రాండ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): యువతను లక్ష్యంగా చేసుకున్న శీతల పానీయాల బ్రాండ్ పెప్సీ నేడు ఓ బ్లాక్ బస్టర్ ప్రకటనను చేసింది . ఇది మెగాస్టార్ యష్ను తమ బ్రాండ్ అంబాసిడర్ గా ఎంచుకుంది . సూపర్ స్టార్ , యష్ , అన్ని భౌగోళిక సరిహద్దులను అధిగమించడంతో పాటుగా అశేష ప్రేక్షక ఆదరాభిమానాలను సొంతం చేసుకున్నారు . బాక్సాఫీస్ వద్ద అత్యంత విజయవంతమైన చిత్రాల కథానాయకునిగా నిలిచారు . యష్ ,పెప్సీల నడుమ ఈ వైవిధ్యమైన భాగస్వామ్యం ఇప్పుడు భారతదేశ వ్యాప్తంగా యువత నడుమ ఎక్కువ చర్చకు వచ్చిన అంశంగా నిలువనుంది.

ఓటు హక్కుపై వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర-తిరువూరు: జాతీయ ఓటురు దినోత్సవ సందర్భంగా తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అవశ్యకతపై మంగళవారం వ్యాచారచన పోటీలు నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి వయోజనుడు ఓటు హక్కు పొందాలని, ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ మురలీకృష్ణ సూచించారు. వ్యాచారచన పోటీలో విజేతలకు బుధవారం బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు.

మానవత్వమే నాకు ముఖ్యం

దళిత చీఫ్ సెక్రటరీ కాకి మాధవరావు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : కులం, మతం, ప్రాంతం అనే తేడా నాకు లేదు. కేవలం మానవత్వమే నాకు ముఖ్యమని రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ కాకి మాధవరావు అన్నారు. విజయవాడ లోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆయన రాసిన "సంకెళ్లు తెంచుకుంటూ" పుస్తక ఆవిష్కరణ బుధవారం జరిగింది. ఈ పుస్తకాన్ని డాక్టర్ జి. సమరం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ మాజీ ఐఏఎస్ అధికారి పీవి రమేష్ అధ్యక్షతన జరిగింది. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సంకెళ్లు తెంచుకుంటూ పుస్తక ఆవిష్కరణ అనంతరం తొలికాపీని దివంగత దళిత రోహిత్ తల్లి రాధికకు అందజేసారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ పేదవాళ్లు ఉంటేనే దొరలుంటారు.కాబట్టే సమాజంలో పేదరికం ఎప్పుడూ అలానే ఉండాలని ఉన్నతవర్గాలు కోరుకుంటాయన్నారు. సమాజంలో కులవివక్షత ప్రాచుర్యంలో ఉన్న సమయంలో తాను చదువుకోడానికి తన తల్లే మార్గదర్శకమన్నారు. నాన్న పెద పాలేరుగా పనిచేస్తూ తమను కూడా అదే వృత్తిలో కొనసాగాలని తమపై వత్తిడి తీసుకురాగా అందుకు భిన్నంగా మానాన్నతో పోరాటం చేసి నన్ను చదివించిందన్నారు. నీ వృత్తిలో నీవు నిజాయితీగా ఉండు, కష్టపడు, నీ ప్రతిభతోనే పై స్థాయిలోకి రమ్మని, నీవు వచ్చిన జీవితాన్ని మర్చిపోకుండా పేదవాళ్ల సాయం చేయమని చెప్పిన తన తల్లి మాటలను అనుసరిస్తూ వచ్చానన్నారు. తనను మెచ్చుకున్న సీఎంలు ఉన్నారు. తనపట్ల పరుషంగా మాట్లాడిన సీఎంలూ ఉన్నారని అయితే ఎవరు ఏమనుకున్నా తాను కార్యదర్శిగా విలువలతో కూడిన సలహాలను మాత్రమే వారికి ఇస్తూ వచ్చానన్నారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన డాక్టర్ జి సమరం మాట్లాడుతూ జాషువా సాహిత్యాన్ని అవపోసన పట్టిన వ్యక్తి కాకి మాధవరావు అన్నారు. ఆయన సాహిత్య పిపాసి ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. విశ్వనరుడు గుర్రం జాషువా సాహిత్యాన్ని నమ్మి ఆయన రాసిన గబ్బిలం ఒక పుస్తకాన్ని ఆంగ్లంలోకి అనువదించారని తెలిపారు. పరిపాలనాదక్షత కలిగిన మహోన్నతమైన వ్యక్తి కాకి మాధవరావు అని తెలిపారు. మనిషిని మనిషిగా చూసే వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అని ఆయన అన్నారు. ఆయన రాసిన ఈ పుస్తకం ఒకనాటి కథ అని దీనికి అనుసంధానంగా ఈనాటి కల, రేపటి అల అనే పుస్తకాలను కూడా రాయడం మంచిదని సూచించారు. ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కె సునీత, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నిమ్మగడ్డ సురేంద్రబాబు, నిమ్మగడ్డ అనురాధ, ఎంఎం నాయక్, సుధీర్, ద్వారకా తిరుమలరావు, ముద్దాడ రవిచంద్ర, విజయకుమార్ తదితరులు ఈ సందర్భంగా ప్రసంగించిన వారిలో ఉన్నారు.